## మనసు శిల కాదు

రాజేశ్వరి రాతిరోటిలో కందిపప్పు వేసి పచ్చడి రుబ్బుతోంది. మండువేసవి. మిట్టమధ్యాహ్నం. కరకరలాడుతూ పచ్చడి రూపాన్ని సంతరించుకోకుండా శరీరానికి శ్రమకల్గించే కటువైన కందిపప్పు అరగంటైనా రాజేశ్వరి పని పూర్తి కానివ్వటంలేదు. వళ్ళంతా చెమట పట్టింది. వంటింటి కిటికీ లోంచి విసిరేవి వేడిగాల్పులే అయినా చెమట చలువకు రాజేశ్వరికి చల్లగానే తగుల్తున్నాయి. పరిస్థితులతో రాజీపడటం మనస్సుతో పాటు ఆమె శరీరానికి కూడా అలవాటైపోయింది.

యంత్రంలా తన పని చేసుకుంటున్న రాజేశ్వరి మనస్సులో ఓ గంట క్రితం జరిగిన సంఘటన ఒక్కసారిగా మెదిలింది. అప్పటికి పగటి పూట వంటింటి పనంతా పూర్తిచేసి కాసేపు తనూ విశ్రాంతి తీసుకుందామని వంటిల్లు వదలి గదిలోకి వెళ్ళిన రాజేశ్వరిని వదినలిద్దరూ చూసిన చూపులు, అన్న మాటలు స్మృతిపథంలో మెదిలేసరికి కన్నీళ్ళు జలజలా రాలాయి.

"నువ్వెందుకొచ్చావ్? మహారాణిలా కూర్చుందామనా?" పెద్ద వదిన పెళుసుగా అంది.

"ఇది మరీ బావుంది. ఆవిడ కాకపోతే మనమా మహారాణులం. హాయిగా పుట్టింట్లో చేరి కాలుమీద కాలేసుకుని తినే దర్జా మన కెక్కడిది?" వ్యంగ్య ధోరణిలో చిన్న వదిన అంది.

"అదేం కాదు. ఇప్పుడు బాగా ఎండగా వుందిగా. కాసేపు ఫేను కింద కూర్చున్నాక సాయంత్రం కోసం వంట, టిఫిన్ అన్నీ ప్రారంభిద్దామని" దీనంగా ఉంది ఆమె స్వరం.

"కూర్చొని నువ్వు చేసేదేముంది? పనా, పాటా, చదువా? సంధ్యా? కాస్త మాకు చిన్న పిల్లల్తో తీరదు కనుక ఆ మాత్రం వంటా పనీ చేస్తున్నావేమో. అంతకు మించి నువ్వే కష్టాలు పడటం లేదు" ఇలా ఇద్దరూ వాక్బాణాలు విసిరారు.

తరువాత "సాయంత్రం సినిమాకు వెడదామంటున్నారు మీ అన్నయ్యలు. త్వరగా వంటచేస్తే నీ ఇష్టం వచ్చినంతసేపు కూర్చోవచ్చు" అంటూ అజ్ఞాపించింది పెద్ద వదిన. రాజేశ్వరి చేసేది లేక వంటింట్లోకి వెళ్ళి పనిలో మునిగిపోయింది. ఈ మాటలు అన్పించుకోవటం తనకి మామూలే. పదేళ్ళుగా వదినల ప్రవర్తన మనస్సును రాయి చేసేసింది. తనతో నిత్యం సహజీవనం గడిపే ఈ రాతి రోటితో, నూతి చప్టా దగ్గర బట్టలుతికే ఆ బండరాయితో తన మనస్సు తాదాత్మ్యం చెందింది.

ఏదో ఓమూల ఇలాటి సంఘటన జరిగినప్పుడు మాత్రం తన మనస్సును తను రాయే అనుకున్నా మెత్తబడి తన జీవితాన్ని గుర్తుచేయక మానదు. ఆలోచిస్తోంది. 'తను దర్జాగా పుట్టింటికి చేరిందా? హాయిగా కాలుమీద కాలేసుకు కూర్చుందా? తను ఓ మహారాణా? అదే నిజమైతే తన బ్రతుకు ఈ వంటింటికి అంకితమయ్యేదా? అప్రయత్నంగా "అమ్మా" అంది రాజేశ్వరి.

ఒక్కసారి కుడిచేయి తీసి చూపుడు వేలు గట్టిగా నొక్కుకుంది. బాధతో విలవిలలాడుతూ 'అమ్మా!', 'అమ్మా!' అనే పదాన్ని మళ్ళీ మళ్ళీ అనుకుంది. ఆ క్షణాల మీదే రోటిలోపడి నలిగిన వేలు కొద్దిగా వాచింది.

నిజంగా అమ్మే వుంటే తను ఈ స్థితిలో వుండేదే కాదు. అమ్మ బ్రతికి వుండగా రాజేశ్వరి అందరిలా గారాబంగానే పెరిగింది. ఎన్నెన్ని మురిపాలో. ఎప్పుడూ ఆడుతూ పాడుతూనే గడిపేది. చదువులో కూడా అమిత శ్రద్ధ. ఆమెకు చదువుపట్ల ఆసక్తి వున్నా తల్లిదండ్రులకు రాజేశ్వరి పెళ్లి చేసేయాలని ఆర్తి. ఆ ఆతృతతోనే పదహారేళ్లు నిండని రాజేశ్వరి కోసం వరుని వేట ప్రారంభించేరు. అన్నలిద్దరూ రాజేశ్వరిని పెండ్లి కూతురిగా చూడాలని ముచ్చటపడ్డారు. ఓ రెండేళ్ళకి అందరి ముచ్చటా తీరింది. రాజేశ్వరికి మాత్రం అప్పుడే పెళ్ళి చేసుకోవాలని లేదు. ఇంకా చదవాలని, ఉద్యోగం చేయాలని ఆమె కోరిక. కానీ పద్దెనిమిదేళ్ళు నిండని రాజేశ్వరి ఎవ్వరికీ బదులు చెప్పలేక పోయింది. అన్నింటికి తల వంచి తాళి కట్టించేసుకుంది.

అత్తవారింటికి వెడుతున్న రాజేశ్వరిని కౌగలించుకుని భోరున ఏడ్చింది అమ్మ. నాన్న కళ్ళలో నీరు నిల్చింది. అన్నలు కూడా ఆవేదనతోనే సాగనంపేరు. రాజేశ్వరికి ఎన్నో రోజులు దుఃఖం వచ్చేది. కానీ భర్త అన్నీ మరపించి ప్రణయలోకాలలో తేల్చి మురిపించేడు. "రాజీ, నువ్వే నా లోకం, నా సర్వస్వం!" అనేవాడు. రాజేశ్వరి అతని సన్నిధిలో కన్నవారినే కాదు. తన మనస్సులోని అణగి వున్న కోరికలనూ మరచిపోయింది.

"సంసార జీవితమే స్వర్గబంధం" అనుకుంది. అంతులేని అందాన్ని ఆనందాన్ని అందించే ఆమని అదృశ్యమై మండుటెండలతో గ్రీష్మం అడుగుపెట్టినట్లు ఆ ఆమని శోభను దోచుకుపోయి తానే ఆక్రమించినట్లు రాజేశ్వరి సుఖమయ జీవితం అదృశ్యమైపోయి భర్తను కోల్పోయి వితంతువుగా పుట్టిల్లు చేరుకుంది.

పుట్టి ఇరవై ఏళ్ళయినా గడవని ఆ ముగ్ధ అరవై ఏళ్ళ వృద్ధురాలిలా ఆనాటి నుంచి వంటింటికి అంకితమైపోయింది. తల్లి బతికి వున్నా కొద్దికాలం కేవలం బాధని మరచి పోవటానికే వంటపనిచేసేది. తల్లి తరువాత వంటపనేకాక ఇంటి పనంతా తన నెత్తినే పడేశారు వదినలు.

తెల్లవారింది మొదలు చీకటిపడేవరకు పన్లతోనే సతమతమయ్యే రాజేశ్వరికి అప్పుడప్పుడు చిరాకు కల్గేది. తనకు కాస్త పనిలో సాయపడమని ఒకటి, రెండుసార్లు వదినలను అడిగింది. "మేము ఊరికే కూర్చోవటం లేదు. మాపన్లు మాకున్నాయి. మీ అన్నయ్యలకీ పిల్లలకీ చాకిరీలు

చేసి చేసి అరిగివొరుగులై పోతున్నాం. ఈ మాత్రం వంటపనీ నువ్వొక్కత్తివే చేస్తే అలసిపోవులే.'
' వదినల నుంచి ఇలాంటి సమాధానాలు రావడం రాజేశ్వరి మనస్సుకు చాలా బాధ కలిగించింది.

అన్నలతో తన ఆవేదన చెప్పుకుని ఎంత వాపోయినా వాళ్ళనుంచి ఏ మాత్రం ప్రయోజనాన్ని పొందలేకపోయింది. కనీసం ఊరటకూడా లభించలేదు. "భర్త చచ్చిపోయిన ఆడపడుచుని ఇంట్లో వుంచుకోవటమే తమ బాధ్యత" అనుకునే అన్నల దగ్గర నుంచి తను ఏం పొందగల్గుతుంది? ఇక తన జీవితం ఇంతే. వీళ్ళ అండన ఈ ఇంట తన బ్రతుకు ఇలా సాగిపోవాల్సిందే.

మండుటెండలను, పెనుతుపానులను, గజగజ వణికించే చలికి చలించని రాయిలా భరించి; మనస్సు కరడు కట్టుకుపోవాలి- అన్న నిర్ణయానికి వచ్చేసింది రాజేశ్వరి. ఇలా ఎంత సరిపెట్టుకున్నా ఆమెలో ఓర్పు రాను రాను నశిస్తోంది. అప్పుడప్పుడు ఆమెకు అనిపిస్తుంది 'మనస్సు శిలకాదు' అని. బాధని ఓర్చుకుంటూనే పచ్చడి రుబ్బటం పూర్తిచేసింది.

కాలింగ్ బెల్ మోగింది. ఆ వేళలో ఇంటికి వచ్చేదెవరో రాజేశ్వరికి తెలుసు. రోజులో ఆ వ్యక్తి రాక మాత్రమే రాజేశ్వరికి అణుమాత్రం ఆనందాన్ని కలిగించేది. నెమ్మదిగా బయటకు నడచింది. తలుపు తీసింది. గోపాల్ ఆమెను జాలిగా చూశాడు. రాజేశ్వరి కూడా అతని ముఖంలోకి అమాయకపు చూపులు చూస్తూ చదవటం పూర్తిచేసిన వారపత్రిక అతని చేతుల్లో వుంచింది.

"సాయంత్రం కొత్త పత్రిక తీసుకొస్తా" అంటూ తన సైకిల్‌మీద వెళ్ళిపోయాడతను. ఇపుడామె మనస్సులో గోపాలే చోటు చేసుకున్నాడు. తనంటే గోపాల్‌కి ఎంత ఆపేక్ష? ఎంత ఖాళీ లేదన్నా వినడు. తను చదువుకునేందుకు పుస్తకాలు తెచ్చి ఇస్తాడు. అవి చదువుకోవటం మాత్రమే తనకు ఆ ఐదేసినిమిషాల మానసిక విశ్రాంతికి కారణం. ఎప్పుడైనా పిల్లలు చింపేస్తే మారుమాట్లాడకుండా ఆ ఖర్చు తనే భరిస్తాడేమో; "ఫరవాలేదులెండి" అనేస్తాడు.

పసిపిల్లలిద్దరినీ ఇంట్లో వదిలేసి అన్నా వదినలు పెద్ద పిల్లల్ని వెంట తీసుకుని సినిమాకి వెళ్ళిపోయారు. తను ఒంటరిగా మిగిలిపోయింది. ఇది ఎన్నో సంవత్సరాలుగా అలవాటే. తన మనస్సు బండబారిపోయింది- అని తను అనుకున్నా ఈ రోజెందుకో ఈ ఒంటరితనం భరించలేనిదిగా అన్పిస్తోంది రాజేశ్వరికి.

ఎప్పుడు అన్నలు, వదినలు ఎక్కడికి వెళ్ళినా "రాజేశ్వరీ, నువ్వు కూడా రా- అనరు. వస్తావా?- అని అడగరు. ఎప్పుడైనా కుతూహలాన్ని ఆపుకోలేక నాకూ ఈ సినిమా చూడాలని వుందనో వాళ్ళింటికి రావాలని వుందనో అంటే "సరిపోయింది! నువ్వు కూడా బయల్దేరితే చంటివాళ్ళని ఎవరు చూస్తారు?" అంటారు. కనీసపు కోర్కెలు తీరే భాగ్యం కూడా కరువై పోయింది.

పెద్దన్నయ్య కొడుకు ఏడవటం మొదలు పెట్టేడు. వాడికి పాలు పట్టి ఉయ్యాల్లో వేసి

ఊపుతూ నిద్రపుచ్చే ప్రయత్నం చేసింది. ఎందుకో తనకు ఈ రోజు బడలికగా వుంది. కాసేపు కళ్ళు మూసుకుని పడుకోవాలనిపిస్తోంది. బాబుని నిద్ర పుచ్చి ఒక్కక్షణం మంచం మీద వాలిందో లేదో చిన్నన్నయ్య కూతురు ఏడవటం మొదలు పెట్టింది. తనకు విశ్రాంతి తీసుకునే అదృష్టం కూడానా. ఇప్పుడు దానికి పాలుపట్టి నిద్రపుచ్చాలి. అది పడుకోకపోతే ఎత్తుకుని ఆడించాలి. తను ఈ పిల్లలకు ఆయా! తను ఈ ఇంటి పనిమనిషి. తనవాళ్ళైన వాళ్ళనే ఇలా అనుకోవాల్సి వస్తోంది. అంతే మరి. తనంటే ఎవరికీ అనురాగం లేదు. తనకు ఎవరూ మమతలు పంచి ఇవ్వరు. తనను అర్థం చేసుకొని ప్రేమగా చూసుకొనే వాళ్ళే లేరు.

అలా ఆలోచిస్తున్న రాజేశ్వరి మనసులో గోపాల్ మెదిలాడు. అతనికి తనపట్ల ఆత్మీయత వుందేమో! లేకపోతే తనను జాలిగా చూస్తూ తనకోసం తన సంతోషంకోసం పత్రికలు ఎందుకు తెచ్చి ఇస్తాడు? అతని చూపుల్లో ఏదో అవ్యక్తానురాగం. ఆ కొన్ని క్షణాలు తనకేదో లోకంలో ఉన్నట్లనిపిస్తుంది.

గోపాల్ తలపులతోనే మనస్సు నిండిపోయింది. ఈ రోజు వస్తాడేమో. తన బాధంతా చెప్పుకోవాలి. ఒక ఆత్మీయుడిగా అతని దగ్గర నుంచి ఓదార్పు పొందాలి.

★ ★ ★

రాజేశ్వరి కోసం వారపత్రికలు తీసుకొని బయల్దేరిన గోపాల్ హృదయం నిండా నిండి వుంది రాజేశ్వరి. ఆమెను తలచుకుంటే అతని మనసంతా ఆర్ద్రమైపోతుంది. ఎంత బేల, ముగ్ధ, అమాయకురాలు అని అనుకొంటాడు. ఆమెకు భగవంతుడు తీరని అన్యాయం చేశాడు. నిండైన జీవితంలో ఏమీ అనుభవించలేకపోతుంది. ఆమెపైన సానుభూతితో కాలక్షేపానికి పత్రికలు ఇవ్వడం తప్ప ఏమీ చేయలేకపోతున్నాడు తను. కానీ ఆమె జీవితాన్ని ఏదో విధమైన మలుపు తిప్పాలి. ఆమెకు సుఖ శాంతులు అందించాలి. అందుకు తనేం చేయాలి? అసలు రాజేశ్వరికేం తక్కువ? ఆమె ముగ్ధమోహనరూపం అతని కళ్ళల్లో కదలాడింది. అది మరుక్షణం దీనంగా మారి కలవరపెట్టసాగింది.

దూరంగా రేడియోలోంచి లలితగీతం వినబడుతోంది. అలానే నిలబడిపోయాడు. అందులోని భావం అతని హృదయాన్ని తాకింది.

"మధుమాస మాధురులు మాసిపోలేదోయ్,
అదుకున్న ఎదకు ఆనందమీవోయ్
ఎత్తవోయీ కేల ఈ బేల సుమబాల..."

బోయి భీమన్నగారి ఆ పాట తనకేదో సందేశం ఇచ్చినట్టు అన్పించింది. నిజమే. నేలరాలిన సుమబాల ధూళిలో కలసిపోవడానికి వీలులేదు. తను ఆ సుమబాలను ఎత్తి హృదయానికి అదుముకోవాలి. అప్పుడు తన బ్రతుకునిండా మధుమాస మాధురులు నింపదా ఆ సుమబాల! అనుకున్నాడు.

కాలింగ్ బెల్ మోగింది. ఆర్ద్రంగా తలుపు తెరిచి లోపలికి పిలిచింది. తన భావం తెలిసినట్లే ఈ రోజు రాజేశ్వరి తనను లోపలికి ఆహ్వానిస్తోంది - అనుకొని ఆమెను అనుసరించేడు గోపాల్. ఇద్దరి మనస్సుల్లోనూ ఏదో చెప్పుకోవాలని ఆరాటం. ఒకరి కొకరు చేరువ కావాలని ఆకాంక్ష. రాజేశ్వరిని చూస్తున్నాడు కానీ ఇదివరకటిలా జాలిగా కాదు ప్రేమగా. రాజేశ్వరి నిలువెల్లా పులకించింది. "రాజీ నీ కోసం ఏమైనా చేస్తాను. నువ్వు నాదానివి కావాలి" అన్నాడతను. రాజేశ్వరి హృదయం అతని పాదాల చెంత మృదుకుసుమమై రాలిపోయింది. ఆ కుసుమాన్ని అతని హృదయంలో పదిలంగా దాచేసుకున్నాడు. మనస్సులు ఒక్కటై పోయాయి. ఏవేవో బాసలు చేసుకున్నాయి మూగ భాషల్లో!

"రాజీ" అన్నాడతను. అలా తనని పది సంవత్సరాల క్రితం భర్త పిలిచేవాడు. ఇప్పుడు ఆ స్థానంలో గోపాల్ నిలిచాడు. నెలల తరబడిని ఇద్దరి మనసులలో పాదుకొంటున్న పరస్పర ఆత్మీయత విస్పష్టమైన రూపును సంతరించుకొని మంచి నిర్ణయంగా మారింది.

★ ★ ★

రాజేశ్వరి అన్నలు, వదినలు బంధువుల ఇంట పెళ్ళికి వెళ్ళారు. ఇక రాజేశ్వరి, గోపాల్ కూడా ఈ అవకాశాన్ని వదల దలుచుకోలేదు. ఇంటికి తాళంపెట్టి తాళంచెవి పక్కింట్లో ఇచ్చింది. "గుడిలాంటి గుడిసెకు వెడుతున్నా" అని చెప్పి వెళ్లిపోయింది. పక్కింటి ఆమె ఉలిక్కిపడింది. 'ఏమంది రాజేశ్వరి! గుడిలాంటి గుడిసె- అంటే తనే పొరపాటుగా విని వుంటుంది గుడికి తప్ప ఎక్కడికి వెడుతుంది? అని సరిపెట్టుకుంది. విషయం తెలిశాక రాజేశ్వరి వదినలతో పాటు ఆమె కూడా నిర్ఘాంతపోయింది.

అందరి దృష్టిలో రాజేశ్వరి 'లేచి పోయింది'

ఆమెతో సహజీవనం గడిపిన రాతిరోలు, బండరాయి అలానే పడి వున్నాయి. రాజేశ్వరి అలా "పడి" ఉండదు. ఆమె "మనసు శిలకాదు."

●

*('స్వాతి' మాస పత్రిక - జనవరి 1993)*